క్లుప్తంగా

ప్రజావాణి రద్దు

వరంగల్: కలెక్టరేట్‌లో అక్టోబర్ 7 (సోమవారం)న నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని పరిపాలన పరమైన కారణాల వల్ల రద్దు చేస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించి ప్రజలు ఫిర్యాదులు ఇచ్చేందుకు కలెక్టరేట్ కార్యాలయానికి రావొద్దని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

మేకప్ కాంపిటీషన్ విజేతగా ఫర్జానా



వరంగల్: హైదరాబాద్‌లో శుక్రవారం రాత్రి జరిగిన మేకప్ కాంపిటీషన్‌లో వరంగల్ ఎల్‌బీనగర్‌లోని లోటస్ బ్యూటీపార్లర్ మేకప్ ఆర్టిస్ట్ షేక్ ఫర్హానా మొదటి బహుమతి గెలుసుకున్నారు. సెలబ్రిటీ జావేద్ హబీబ్ చేతుల మీదుగా ప్రథమ బహుమతి అందుకున్న ఫర్హానాను స్థానిక కార్పొరేటర్ ఫుర్కాన్, తదితరులు శనివారం అభినందించారు.

వందనకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: హనుమకొండకు చెందిన కందకూరి వందనకు బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఏ స్టడీ ఆఫ్ వర్క్ లైఫ్ బ్యాలెన్స్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టూ మెడికల్ ప్రాక్టీషనర్స్ ఆఫ్ వరంగల్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి వందనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ ఆల్వాల రవి పర్యవేక్షణలో వందన తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

నేషనల్ ఆర్చరీలో ప్రతిభ




విద్యారణ్యపురి: ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని కొల్లూరు డీపీఎస్‌లో శుక్రవారం, శనివారాల్లో నిర్వహించిన నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీల్లో హనుమకొండ జిల్లా కేంద్రంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి గుగులోతు నిశాల్‌రాజ్ ప్రతిభ కనబరిచాడు. అండర్ –10 బాలుర కేటగిరీలో ఆర్చరీ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించాడు. ఈమేరకు ఆ క్రీడాకారుడిని ధర్మసాగర్ మండలం ఎంఈఓ డాక్టర్ రాంధన్, ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

చేపల వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



మామునూరు: చేపల వ్యాధులపై పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మత్స్య శాఖ అధికారి నాగమణి సూచించారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు పి.వీ. నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో జాతీయ మత్స్య అభివృద్ధి మండలి హైదరాబాద్ సౌజన్యంతో చేపల వ్యాధి నిర్ధారణ, ఆరోగ్య నిర్వహణపై ఐదు రోజులుగా మత్స్యకారులకు నిర్వహిస్తున్న శిక్షణ సదస్సు శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి నాగమణి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు సీహెచ్ సౌమ్య, జి. గణేశ్, శశాంక్, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

పేదింటి యువతి పెళ్లికి ఆర్థిక సాయం



మామునూరు: ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురంలోని లక్ష్మీపురంలో ఓ పేదింటి యువతి పెళ్లికి జనతా గ్యారేజ్ హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆర్థిక చేయూతనందించింది. ఈమేరకు యువతికి రూ.7,500 నగదును సంస్థ చైర్మన్ సుభాకర్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో రాజేందర్, రాజేష్, బహదూర్, కమల్, విజయ్, పండు పాల్గొన్నారు.

గోశాలకు గోవుల తరలింపు

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామ శివారులో ఒక రహస్య ప్రాంతంలో దాచిన గోవులను గో సంరక్షణ పోరాట సమితి కార్యకర్తలు శనివారం పోలీసులకు అప్పగించగా వారు వాటిని గోశాలకు తరలించారు. ఇటీవల పట్టణంలోని కబేళాల నిర్వాహకులు పశువులను వధించి మాంసం విక్రయిస్తున్నారు. కబేళాకు తరలించడానికి సోమిడి శివారులో 16 గోవులను వ్యాపారులు దాచిపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న గో సంరక్షణ సమితి కార్యకర్తలు.. పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో పశువులకు పంచనామా చేసి ఉనికిచర్ల గ్రామంలో ఉన్న బృందావనం గోశాలకు తరలించారు. కార్యక్రమంలో గో సంరక్షకులు పెసరు తిలక్, కమతం శ్రీనివాస్, మేకల కేదారియాదవ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తం

- రోడ్డు ప్రమాదాలకు నిలయంగా న్యూశాయంపేట జంక్షన్
- సిగ్నల్ వ్యవస్థ లేక ఇక్కట్లు



న్యూశాయంపేట చౌరస్తాలో ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనదారులు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం 31వ డివిజన్‌లోని న్యూశాయంపేట చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ లేక వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హంటర్‌రోడ్డు న్యూశాయంపేట జంక్షన్ రోడ్డు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారింది. రాత్రివేళ్లలో వాహనాలు, భారీ వాహనాలు ఇష్టారీతిన వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

నాలుగు మార్గాల కూడలి

కాజీపేట నుంచి వరంగల్‌కు వెళ్లేందుకు హంటర్ రోడ్డు నుంచి న్యూశాయంపేట మీదుగా, హనుమకొండ నుంచి పద్మాక్షి వైపు న్యూశాయంపేట మీదుగా కాజీపేట, హనుమకొండ, వరంగల్, హంటర్ రోడ్డుకు వెళ్లే నాలుగు మార్గాలు న్యూశ్యాయంపేట జంక్షన్ ఉన్నాయి. కాగా, చౌరస్తాలో ట్రాఫిక్ కంట్రోల్ సిగ్నల్ వ్యవస్థ లేదు. జంక్షలో ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని కోరినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు, ప్రజలు చెబుతున్నారు.

వైభవంగా దేవీ నవరాత్రోత్సవాలు



కాశిబుగ్గ: అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



పద్మాక్షిదేవి ఆలయంలో వెంకటరెడ్డి దంపతులు

హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరి దేవి దేవాలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకుడు ఝెల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి అమ్మవారికి శనివారం అభిషేకం, చతుషష్టి పూజలు నిర్వహించారు. నిత్యక్లిన్న క్రమంలో పూజలు చేసి రోహిణిగా అమ్మవారిగా అలంకరించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

కనకదుర్గమాత దేవాలయంలో..

కాశిబుగ్గ: వరంగల్ – నర్సంపేట ప్రధాన రహదారిలోని దయానందకాలనీలోని కనకదుర్గమాత దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారిని శనివారం గాయత్రిమాతగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాశ్, సింగిరికొండ వెంకటేశ్వర్లు, సర్వేరియా సురేష్‌కుమార్, కొప్పుల సరోజన, వేణు, వెంకటేశ్వరరావు, ప్రభాకర్, శారద తదితరులు పాల్గొన్నారు.



రాజరాజేశ్వరి అమ్మవారు

అమ్మవారిని దర్శించుకున్న అదనపు కలెక్టర్

కాజీపేట: హనుమద్గిరి పద్మాక్షిదేవిని అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి దంపతులు శనివారం దర్శించుకున్నారు. శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ చరిత్ర, అమ్మవారికి జరుగుతున్న నిత్యా పూజలను వారికి ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు వివరించారు. అదనపు కలెక్టర్ దంపతులకు దేవాలయ ఆస్థాన వేద పండితులు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని, నాగిళ్ల శంకర్‌శర్మ అమ్మవారి చిత్రపటాన్ని అందించి ఆశీర్వచనం చేశారు.

యువకుడి అదృశ్యం



మడికొండ: ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన రాంపేట గ్రామంలో జరిగింది. మడికొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాంపేట గ్రామానికి చెందిన జెల్ల సందీప్‌కుమార్ (33) ఈనెల 1న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా అతని జాడ కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్ బాధిత కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 87126 85123, 87126 85248 నంబర్లకు కాల్ చేసి సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

ఖిలా వరంగల్: ఓ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుడి కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. హనుమకొండ దర్గా రోడ్డుకు చెందిన డాక్టర్ అజ్మీర శ్రీనివాస్ కారు డ్రైవర్‌గా కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన శరత్‌కుమార్ పనిచేస్తున్నాడు. రోజువారీగా ఈనెల 1న డాక్టర్ అజ్మీర శ్రీనివాస్‌ను ఓ ఆస్పత్రిలో దింపి సెల్లారులో కారు పార్కింగ్ చేశాడు. కారులో పెట్టిన రూ.54 వేలు కనిపించకపోవడంతో డాక్టర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనదారుడిపై..

ఖిలా వరంగల్: రోడ్డు ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపారు. దేశాయిపేటకు చెందిన జన్ను పుష్ప లేబర్ కాలనీకి వెళ్లి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఆమెను ఓ వాహన డ్రైవర్ వాహనంతో ఢీకొట్టాడు. దాంతో ఆమెకు రోడ్డుపై పడగా తీవ్ర గాయాలయ్యాయి. జన్ను అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ వివరించారు.

రిటైర్డ్ ఎంఈఓ రాధాకృష్ణ మృతి

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలోని విశ్వనాథ కాలనీకి చెందిన రిటైర్డ్ ఎంఈఓ రాధాకృష్ణ శనివారం అనారోగ్య సమస్యలతో మృతి చెందాడు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ నాయకులు ప్రదీప్‌రావు, కర్నె రవీందర్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, తదితరులు పరామర్శించారు.

వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి

హసన్‌పర్తి: సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణ అమలు తర్వాతే డీఎస్సీ నియామకాలు చేపట్టాలని ఎంఎస్పీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బండారు సురేంద్ర మాదిగ డిమాండ్ చేశారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ఆర్డినెన్స్ తీసుకొచ్చి డీఎస్సీ నియామకాలు చేపట్టాలని కోరుతూ ఈనెల 9న జిల్లా కలెక్టరేట్లను ముట్టడించనున్నట్లు తెలిపారు. ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజారపు భిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఎస్పీ నాయకుడు ఆరెపల్లి పవన్, ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ నందిపాక అరవింద్, నాయకులు పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో తరగతులు

- నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్ నిర్వాకం
- గేట్‌కు, ప్రిన్సిపాల్ గదికి తాళం వేసిన ఎంఈఓ రమేష్‌బాబు



ప్రిన్సిపాల్ గదికి తాళం వేస్తున్న ఎంఈఓ

విద్యారణ్యపురి: దసరా సెలవుల్లో పదవ తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్న హనుమకొండ నక్కలగుట్టలోని ఓ ప్రైవేట్ హైస్కూల్ ప్రిన్సిపాల్ గదికి, గేట్‌కు ఎంఈఓ తాళం వేశారు. ప్రిన్సిపాల్‌కు నోటీసు జారీ చేశారు. సెలవుల్లో తరగతుల నిర్వహణపై డీఈఓకు ఫిర్యాదు వెళ్లడంతో హనుమకొండ ఎంఈఓ రమేష్‌బాబు ఆ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. టెన్త్ క్లాస్ విద్యార్థులకు తరగతులు జరుగుతున్నట్లుగా గుర్తించి, ఆ విద్యార్థులను బయటికి పంపించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు శ్రీచైతన్య స్టడీ మెటీరియల్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. హైస్కూల్‌కు సెంచరీ హైస్కూల్ పేరుతో అనుమతి ఉందన్నారు. ఇచ్చిన నోటీస్‌కు రెండు రోజుల్లో ప్రిన్సిపాల్ వివరణ ఇవ్వాల్సి ఉందని తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారు

హనుమకొండలో నిబంధనలకు విరుద్ధంగా దసరా సెలవుల్లో ఓ ప్రైవేట్ హైస్కూల్‌లో తరగతులు నిర్వహిస్తున్నట్లు తాము డీఈఓ దృష్టికి తీసుకెళ్లామని ఏబీవీపీ హనుమకొండ జిల్లా కన్వీనర్ సుజిత్ తెలిపారు. డీఈఓ వెంటనే స్పందించి ఎంఈఓను పంపించారని తనిఖీ చేసి పాఠశాలకు తాళం వేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు అరుణ్, భరత్, శ్రవణ్‌కుమార్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో కొనసాగుతున్న ఎన్‌సీసీ శిబిరం



కేడెట్లకు ఆయుధ శిక్షణ ఇస్తున్న అధికారి

కేయూ క్యాంపస్: ఎన్‌సీసీ పదో తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ బెటాలియన్ క్యాంపు కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్.రామదురై పర్యవేక్షణలో వరంగల్, ఖమ్మం గ్రూపుల రిపబ్లిక్ డే సన్నాహక క్యాంపు కొనసాగుతోంది. ఈమేరకు రిపబ్లిక్ డే క్యాంపు, డ్రిల్, పరేడ్, సాంస్కృతిక విభాగం, బెస్ట్ కేడెట్, ఫ్లాగ్ ఏరియా, ఆయుధాలతో శిక్షణ పద్ధతులను వరంగల్ గ్రూపు కమాండర్ కల్నల్ సచిన్ అన్నారావు శనివారం క్షుణ్ణంగా పరిశీలించారు. 2025లో న్యూఢిల్లీలో రిపబ్లిక్ డే పాల్గొనే ఎన్‌సీసీ కేడెట్లకు పలు సూచనలు చేశారు. క్యాంపులో డిప్యూటీ కమాండర్ లెఫ్టినెంట్ రవి సునారే, సుబేదారి మేయర్ సౌరస్య, కెప్టెన్ విజయ్, లెఫ్టినెంట్ ఎస్.స్వామి, రాజమాణిక్యం, వాసు, భవాని, సూపరింటెండెంట్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఏసీపీ తిరుమల్‌రావు

కాజీపేట: నానాటికి యువత మనుగడకు ప్రమాదకరంగా మారుతున్న మాదక ద్రవ్యాలను బహిష్కరించి ఆదర్శవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పాటు అందించాలని ఏసీపీ తిరుమల్ రావు సూచించారు. కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని దర్గా కాజీపేట (జాగీర్)లో శనివారం రాత్రి సాయుధ పోలీసు బలగాల పహారాలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నిషేధిత వస్తువులు విక్రయిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అనుమానాస్పద వ్యక్తులను విచారించి వివరాలు సేకరించారు. తనిఖీల్లో సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సైలు లవన్‌కుమార్, నవీన్ కుమార్, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల త్యాగాల దినం



అమరులకు నివాళి అర్పిస్తున్న కార్మికులు

హన్మకొండ: హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ –1, వరంగల్ –2 డిపోల్లో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ రక్షణ – కార్మికుల త్యాగాల దినాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర కార్మికుల చిత్రపటాలపై కార్మికులు పూలు చల్లి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు 2019 అక్టోబర్, నవంబర్ మాసాల్లో 55 రోజుల పాటు సమ్మె చేశారని గుర్తుచేశారు. అప్పటి ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను పరిష్కరించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా 25 మంది కార్మికులు బలవన్మరణం చెందారని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ప్రతి యేటా వారి సంస్మరణార్థం కార్మికుల త్యాగాల దినాన్ని పాటిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు



పింగిళి బాలికల జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలో అధ్యాపకులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ వృత్తి విద్య జూనియర్ కళాశాలలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో శనివారం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆటపాటలతో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ఎస్.శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే, హనుమకొండ ప్రభుత్వ కోఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కవిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలలో..

హన్మకొండ: వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. బతుకమ్మ పండుగ ప్రాధాన్యతను కళాశాల ప్రిన్సిపాల్ కవిత వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు శ్రీనివాస్, పి.శ్రీదేవి, అజయ్‌కుమార్, పుష్పలత, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మోషన్ కళాశాలలో..

హన్మకొండ: హనుమకొండ నయీంనగర్‌లోని మోషన్ కళాశాలలో శనివారం బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. రంగురంగు పూలతో బతుకమ్మలు పేర్చి వాటిని ఒకచోట పెట్టి వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మోషన్ కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ మాట్లాడుతూ బతుకమ్మలో తెలంగాణ జీవన విధానం ఇమిడి ఉందని వివరించారు. కార్యక్రమంలో మోషన్ కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల సురేష్, సిబ్బంది తాళ్లపెల్లి రమేష్ గౌడ్, అరుణ, శిల్ప, మమత, అరుణ్, కొడారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రంగశాయిపేట జూనియర్ కళాశాలలో..

ఖిలా వరంగల్: బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ రైల్వేగేట్ ప్రాంతం రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబురాలను జరుపుకున్నారు. అలాగే, కేవీ పాఠశాలలో ప్రిన్సిపాల్ దాసి సతీష్‌మూర్తి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

మాజీ మంత్రి వెంకటస్వామికి నివాళి



వరంగల్: వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సత్యశారద, అధికారులు



హనుమకొండ కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, అధికారులు

వరంగల్: బలహీన వర్గాల ఆశాజ్యోతిగా.. కార్మిక నాయకుడిగా గుర్తింపు పొందిన గొప్ప నాయకుడు కేంద్ర మాజీ మంత్రి, తెలంగాణ ఉద్యమ నేత గడ్డం వెంకటస్వామి అని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. వెంకటస్వామి జయంతిని పురస్కరించుకొని శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గడ్డం వెంకటస్వామి పెద్దపల్లి నియోజకవర్గం నుంచి ఎన్నో ఉన్నత పదవుల ద్వారా పేదల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ఎంతో కృషి చేశారని అన్నారు. కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, సూపరింటెండెంట్ మంజుల, తహసీల్దార్ రియాజొద్దిన్, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమకొండ కలెక్టరేట్‌లో..

కాజీపేట: మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతి వేడుకలను హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి చిత్రపటానికి అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, డీఆర్వో వైవీ.గణేష్, అధికారులు, ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎన్పీడీసీఎల్‌లో..

హన్మకొండ: మాజీ కేంద్రమంత్రి జి.వెంకటస్వామి జయంతి వేడుకలను హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.జనార్దన్, సీజీఎంలు కె.రాజుచౌహాన్, రవీంద్రనాథ్, బీకంసింగ్, జీఎంలు దేవేందర్, మాధవరావు, వేణుబాబు, నాగప్రసాద్, వెంకటకృష్ణ, శేషారావు, సత్యనారాయణ, మల్లికార్జున్, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులు పోరాడాలి



మహాసభలో అభివాదం చేస్తున్న బీఎస్ఆర్‌కేఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు

మడికొండ: సంక్షేమ పథకాల కోసం భవన నిర్మాణ కార్మికులు నిరంతర పోరాటాలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (బీఎస్ఆర్‌కేఎస్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కామల్ల అయిలన్న పిలుపునిచ్చారు. బీఎస్ఆర్‌కేఎస్ హనుమకొండ జిల్లా ఆరో మహాసభ మడికొండలోని కరిష్మా గార్డెన్‌లో శనివారం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా కరిష్మా గార్డెన్ వరకు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ముఖ్యఅతిథిగా అయిలన్న హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అనేక ఉద్యమాలు చేసి 1996 చట్టాన్ని సాధించుకుందని ఆయన గుర్తుచేశారు. కార్మికుడి జీవితకాలం లేబర్‌కార్డు కొనసాగించాలని, పనిముట్ల కొనుగోలుకు ప్రతి కార్మికుడికి రూ.10 లక్షల రుణం, 50 సంవత్సరాలు నిండిన ప్రతీ కార్మికుడికి నెలకు రూ.5 వేల పింఛన్ ఇవ్వాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అయిలన్న కోరారు. ఈ మహా సభలో జిల్లా అధ్యక్షుడు మూల వీరనర్సింహులు, ఎస్‌కే అలీ, సాయికుమార్, మధు, కుమారస్వామి, సంపత్, కొమురన్న, రాజేందర్, యాదగిరి, ఎండీ అజీమొద్దీన్, అంకం రాజు, అయిలయ్య, వివిధ మండలాల అధ్యక్షులు చిక్కుడు సాయిలు, సదన్‌రావు, రమేశ్, రాజ్‌కుమార్, శ్రీనివాసు, దశరథం, శ్రీనివాస్, కుమారస్వామి, రాజబాబు, సత్యం, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఉత్సవాలకు భద్రతా ఏర్పాట్లు చేయాలి

కాశిబుగ్గ: కాశిబుగ్గ చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద జరగనున్న బతుకమ్మ, రావణవధ, దసరా ఉత్సవాలకు భద్రతా ఏర్పాట్లు చేయాలని కాశిబుగ్గ దసరా ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు సీపీ అంబర్ కిషోర్‌ఝాను శనివారం కలిసి వినతిపత్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 34 ఏళ్లుగా కాశిబుగ్గలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఉత్సవాలకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు తరలివస్తారని తెలిపారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు దూపం సంపత్, కన్వీనర్ బయ్యా స్వామి, సముద్రాల పరమేశ్వర్, బాంబుల కుమార్, ఓంప్రకాష్ కోలారియా, సిద్దోజు శ్రీనివాస్, వేముల నాగరాజు, క్యాతం రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకలకు బందోబస్తు ఏర్పాటు చేస్తాం

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు గుట్ట రంగలీల మైదానంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. ఈమేరకు వరంగల్ ఉర్సుగుట్ట రంగలీల మైదానాన్ని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు, కమిటీ సభ్యులు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, మిల్స్‌కాలనీ ఎస్సై సురేష్‌తో కలిసి ఏసీపీ శనివారం సందర్శించారు. ట్రాఫిక్ మళ్లింపు, వాహన పార్కింగ్ ప్రదేశాలు, వీఐపీ, వీవీఐపీ ఎంట్రెన్స్ గేట్లు, సందర్శకుల కోసం భారీ గేట్ల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వాహనాలు, కార్లు కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలను కేటాయిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు మేడిది మధుసూదన్, మండ వెంకన్న, వెలిదే శివమూర్తి, వంగరి కోటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు గోనె రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రావణవధ ఏర్పాట్లు ప్రారంభం

రామన్నపేట: శ్రీభద్రకాళి సద్దుల బతుకమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో కొత్తవాడలోని తోట మైదానంలో నిర్వహించనున్న దసరా సందర్భంగా రావణవధ కోసం ప్రతిమ ఏర్పాట్లను స్థానిక కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు శిరబోయిన రాజు, ప్రధాన కార్యదర్శి కొక్కుల సతీష్, చిప్ప వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు నీలం రాజ్‌కుమార్, సభ్యులు అరుణ్, సతీష్, మురళి, రాము, శంకర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

విద్యను ప్రజాస్వామ్యీకరించాలి

నయీంనగర్: విద్యా విలువల పునాదిగా విద్యను ప్రజాస్వామ్యీకరించాలనే డిమాండ్‌తో ధర్మ టీచర్స్ యూనియన్ యుద్ధం చేస్తోందని డీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదిద్శి దామెర ఉపేందర్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ధర్మ టీచర్స్ యూనియన్ ఏర్పడిందని గుర్తుచేశారు. టీచర్ల సమస్యలపై రాజీలేని పోరాటం చేసే డీటీయూలో సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్దెంకి బాబు, శ్యాంసుందర్, బొక్క కిషన్, బొడ్డు బాబు, శ్రీనివాస్, జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రైవేట్ ఉత్తమ టీచర్లకు సన్మానం

నయీంనగర్: రాష్ట్ర ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని 250 మంది ప్రైవేట్ టీచర్లను హనుమకొండ వాగ్దేవి కళాశాలలో ఆదివారం సన్మానించనున్నట్లు తెలంగాణ ఆల్ ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చందర్‌లాల్ నాయక్ చౌహాన్ తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దసరా సెలవుల్లో కూడా ప్రైవేట్ టీచర్లు పనిచేస్తున్నారని వాపోయారు. విద్యాశాఖ ఆదేశాలు ప్రైవేట్ స్కూళ్లకు వర్తించవా అని ప్రశ్నించారు. ప్రైవేట్ టీచర్లకు సన్మానంతో పాటు ఉచితంగా రూ.5లక్షల ప్రమాద బీమా కార్డు కూడా అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో చిందం ప్రకాష్, మేడి ప్రభాకర్, ముకుందం, రాపర్తి సుజాత, అస్మబేగం, చంద్రమోహన్, నరేష్, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ భవానినగర్ కాలనీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు బైరి శ్రీనివాస్ శుక్రవారం మృతిచెందారు. ఈమేరకు బాధిత కుటుంబ సభ్యులను స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు. బాధతులను పరామర్శించిన వారిలో 63వ డివిజన్ కార్పొరేటర్ విజశ్రీరజాలీ, మాజీ కార్పొరేటర్ గోల్కొండ రాంబాబు, 47వ డివిజన్ అధ్యక్షుడు అజ్గర్, కాంగ్రెస్ నాయకులు సిరిల్ లారెన్స్, సిలువేరు విజయభాస్కర్, రాజ్‌కుమార్, పోగుల శ్రీనివాస్, భిక్షపతి, తిరుపతి, మాతంగి స్వామి, భాషపాక శ్రీనివాస్, వాసు, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
కె. సుధాకర్ (ACO) : 9177258410 (హన్మకొండ)
పి.చంద్రశేఖర్ (ACO) : 9963646944 (వరంగల్)